# భగవాన్

**– జనార్ధనసూరి**

**నేను వాళ్ళింటికెళ్ళేటప్పటికి ఆంజనేయులు చక్కగా స్నానం చేసి, పంచె, లాల్చీలో, ప్రసన్న వదనంలో బొట్టు పెట్టుకుని కనిపించాడు. ఎవరో ఒక గురువు రావడమో, లేక ఆధ్యాత్మిక కార్యక్రమమో ఉండి వుండాలి. నా అంచనా నిజమే అయింది.**

''భగవాన్ వచ్చారు. దర్శనం చేసుకుని వద్దాం పద. అదృష్టం. సమయానికి వచ్చావు నువ్వు.'' ఏ భగవాన్? అని అడగలేదు. వాడి పదజాలం వాడిది. ఒకరిని గురువుగారు అంటాడు, ఒకరిని మాస్టర్ అనీ, గురూజీ అనీ, అమ్మగారు అనీ, మహాత్మా, యోగీ, గురు పరమాత్మా, బాబా, ఇలా ఎంతో మందికి ఎన్నో పేర్లు పెట్టాడు వ్యవహరించడానికి. ఎవరు? అని అడిగినప్పుడు ఓపిగ్గా సమాధానం కూడా చెప్పాడు. కానీ, నాకే గుర్తుండవు అవన్నీ. అందుకే ఈసారి అడగలేదు.

''సరే పద'' అని బయలు దేరాను. నా వ్యాపకం, అలవాట్లు, అవగాహనా నాకున్నై. ఎవరో ఏదో చెప్తే నేను మారిపోతానేమో, సంసారానికి పనికి రానేమో, బైరాగ జీవనం మీద మోజు పుడుతుందేమోననే భయం నాకు లేదు కాబట్టి ఎవరి దగ్గర్కైనా వెళ్ళడానికి, వాళ్ళు చెప్పింది వినడానికీ సంకోచించ లేదు. అంతేకాదు, అక్కడి పద్ధతులు కనిపెట్టి వాటి కనుగుణంగానే మెసలడం అలవాటు. ఆ పెద్దాయన చెప్పేది ఆకళింపు చేసుకుంటాను గూడా.

''హలో ఇంట్లో ఉండవేమోననుకున్నా'' అంటూ ఇంట్లోకి వచ్చాడొకతను ఇంతలో. ఏమిటో ఈ పలకరింపు? ఉండడనుకుంటే రావడమెందుకో! ఎక్కడికెళ్లాడు, ఎప్పుడు వస్తాడు? అంటూ కాస్సేపు ఆంజనేయులు భార్య కళ్ళల్లోకి, మొఖంలోకి చూసుకుంటూ మాట్లాడదామనుకున్నాడా?

''ఆ రావోయ్ రా. ఎప్పుడొచ్చావ్'' అని పలకరించాడు ఆంజనేయులు. నన్ను అతనికి పరిచయం చేసి, ''వీడు నా క్లాస్‌మేట్. ఐదో క్లాస్ వరకూ. పద్మనాభం. మా వూళ్ళో మా ఇంటి ఎదురు ఇల్లే వీడిది'' అని అతన్ని నాకు పరిచయం చేశాడు.

'ఎక్కడికో బయలుదేరినట్టున్నావ్' అన్నాడు పద్మనాభం.

''నువ్వూరా. భగవాన్ దర్శనం చేసుకుని వద్దాం'' అన్నాడు ఆంజనేయులు.

''ఆయనెవరు?'' అని మొఖమంతా ప్రశ్నార్థకం చేసుకున్నాడు పద్మనాభం.

''నీకు తెలీదులే...'' అంటూ మొదలుబెట్టి, ఆ భగవాన్ గురించి, ఆయన మహాత్మ్యాలు, వాక్కు మొదలయిన అంశాలన్నీ తన్మయంతో చెప్పుకుపోతున్నాడు ఆంజనేయులు.

పాపం, ఆంజనేయులు తన్మయత్వం అల్పాయుష్షుదయింది.

''ఆగాగు. వాడెవడనుకుంటున్నావ్? నరిసింమూర్తి'' అన్నాడు పద్మనాభం.

''ఏ నరిసింమూర్తి?'' ఆంజనేయులు గతుక్కు వాడి గొంతులో ధ్వనించింది.

''వాడే, మన చిన్నప్పుడు మనూరుకి కొత్తగా వచ్చిన టీచరమ్మని...''

''చ ఛ...''

''కఖగఘలనించి చదివినా, వాడే నీ భగవాన్. అదీ, వీడూ కలిసి బాగానే సంపాయించారు. ఆశీర్వాదాలు అమ్ముకుంటూ జాగాలు, నగా నట్రా బానే జాగర్తపడ్డారు.''

''ఓరి వీడి దుంపతెగా! అ''

''అ ఏమిటీ? ఇప్పటికీ సిగరెట్లు తాగుతాడు. రోజూ టీ.వీ. చూస్తాడు...''

''సర్లే. నరిసింమూర్తి గురించి తెలియందా ...''

ఇలా వాళ్ళ సంభాషణ నరిసింమూర్తి ఉరఫ్ భగవాన్ మీద దుమ్మెత్తిపోస్తూంటే, నా ఆలోచనల్లోకి నేను వెళ్ళాను. ఎందుకో, ఎవరి గురించైనా మంచిగా చెప్తే ఏమీ ఉండదు గానీ, చెడుగా చెండాడుతూంటే ఎంజాయ్ చెయ్యలేని బలహీనత నాది. చిన్నప్పుడు చూసిన కార్టూన్ గుర్తొచ్చింది. స్కూలు ప్రోగ్రెస్ కార్డులో సున్నా మార్కులు చూసి నాన్న కళ్ళెర్ర జేస్తే, ''అరసున్నా కూడా వచ్చిన వాళ్ళున్నారు నాన్నా'' అంటాడు ఆ కుర్రాడు.

ఎంతలో ఎంత విషపూరితమయింది ఆంజనేయులు మనస్సు!

''ఆ టీచర్‌కి సరిగ్గా పలకడమే రాదు!'', ''పెద్ద డిగ్రీ, స్టేట్ ఫస్ట్, గోల్డ్‌మెడలిస్టు మా బాస్. చిన్న అఫీషియల్ లెటర్ డ్రాఫ్ట్ చెయ్యాలంటే నేను కావల్సిందే!'', ''గొప్ప ఖబుర్లు చెప్తారు, కూరగాయలు ఏరడం రాదు మా ఆయనికి!'' ఇలా అనుకుంటూంటే ఎంత తృప్తి వీళ్ళందరికీ! ''పెద్ద పోటుగాడిలా వెళ్ళాడు ఏమయింది?'' అని చెప్తే ఆనందం కాదా! ''పెద్ద సంగీత దర్శకుడ్నని పోజు కొడతాడు. స్వరాలు సరిగ్గా పలుకకపోతే మా నాన్న వాడి చేత గుంజీలు తీయించాడు'', ''ఫారిన్ రిటర్న్‌డ్ డాక్టర్! మరి నరానికి ఇంజెక్షన్ చెయ్యాలంటే మా వాడుండాల్సిందే పక్కన'' కంపౌండర్ గారి తండ్రికి ఎంత ఆత్మ సంతృప్తి!

నా ఆలోచనలు, ఒకసారి ఒక కాలేజి స్టూడెంటుకీ ఒక కాయకష్టం చేసే మనిషికీ మధ్య జరిగిన సంభాషణ మీదకు వెళ్ళాయి.

★★★

అది ఒక భోజనం హోటల్. ఉస్మానియా యూనివర్సిటీకి దగ్గరలో వుంది. చిన్న హోటల్ కావడం వలన లంచ్ టైంలో తినేవాళ్ళు తింటూ వుంటేనే, భోజనం టికెట్లు టేబులు మీద పెట్టి సీటు రిజర్వు చేసుకుంటున్నారు. అది గమనించని ఒకతను సీటు ఖాళీ అవగానే కూర్చున్నాడు. ''అది నాది, టిక్కెట్లు ముందే పెట్టాను'' అంటాడు ఒక యువకుడు. ''నేను వచ్చి చాలా సేపయింది, టిక్కెట్లు నా దగ్గరా వుంది'' అంటాడు అక్కడి రివాజు తెలియని మనిషి. వాగ్వివాదం మొదలవగానే తిట్లు లంకించుకున్నాడు ఆ యువకుడు. అతని తిట్లకు ఆశ్చర్యపోయాడు కొత్త మనిషి. అటువంటి వాతావరణంలో అలాంటి బండబూతులు తిడతారు, తిట్టొచ్చు అని ఊహించలేకపోయాడు.

''సదువుకున్నోళ్ళు అట్టా మాట్టాడుతుండావే...'' అన్నాడు.

''అవును. నేను చదువుకున్న వాడినే. ఇక్కడ కాలేజీ స్టూడెంటుని. అయితే? నాకు బూతులు రాగూడదా? నువ్వు చదువుకోకపోతే ఏ మాటైనా మాట్లాడచ్చా? నేను చదువుకున్నా కాబట్టి జాగ్రత్తగా




మాట్లాడాల్నా? నేనూ ఎంత తిట్టైనా తిడతారా...''

❋❋❋

నా ఆలోచనలకు భంగం కలిగింది. ఆంజనేయులూ, పద్మనాభం చాలా సేపటి నుంచి మాట్లాడుతూనే వున్నారు. దానివలన నాకేం అంతరాయం కలగలేదు.

''సారెక్కడో ఆలోచిస్తున్నారు''


''ఆయనంతేలే...''

అని వాళ్ళ సంభాషణ నా మీదకు మళ్ళేటప్పటికి వాళ్ళ లోకంలోకి వచ్చి పడ్డాను.

''నాకు ఎక్కడో చదివిన బుద్ధ చరిత్రలోని ఒక అంశం గుర్తొచ్చింది'' అన్నా.

''చెప్పు చెప్పు'' అన్నాడు ఆంజనేయులు.

''రాజ్యం, సర్వసంపదలూ, భార్యా పిల్లలను వదిలేసి వచ్చిన గౌతమ బుద్ధుడు కఠోర తపస్సు చేసి, తనకు లభించిన జ్ఞానాన్ని, దేశాటన చేస్తూ పంచి పెట్టసాగాడట. మొదట్లో తాను తీసుకునే ఆహారాన్ని క్రమక్రమంగా తగ్గించి, పూర్తిగా ఆహారం లేకుండా ఉండగలిగి, వెన్నుకంటుకున్న కడుపుతో తిరుగుతున్న సమయంలో, ఒక గ్రామంలో, ఆయనని భక్తి శ్రద్ధలతో చూస్తున్నవారు ఇంకా ఎక్కువగా చూపించడం మొదలుపెట్టారట. కనీసపు ఆహారం మితంగా తీసుకోవడం అవసరమని తెలుసుకున్న బుద్ధులవారు తిరిగి కొద్ది కొద్దిగా ఆహారం తీసుకోవడం గమనించిన ఆ గ్రామవాసులు ఒక్కసారిగా ఆయన మీద గౌరవం పొయ్యి, పట్టించుకోవడం




మానేశారట. ఆ తరువాత తమ తప్పు తెలుసుకుని మళ్ళీ ఆయన్ని ఆదరించారట.''

వాళ్ళిద్దరూ ఏమీ బదులు చెప్పలేదు. అసందర్భ ప్రేలాపనలా అనిపించి వుండొచ్చు వాళ్ళకి.

''గురువు మాత్రం మనిషి కాడా? ఆయన కున్న జ్ఞానాన్ని పంచి ఇస్తున్నంత మాత్రాన ఆయన అన్నిటిమీదా కోరికలను వదులుకోవాలనీ, ఏదో నిర్లిప్తంగా వుంటూ, ఆశ్రమ వాసం చేస్తూ, చప్పిడి కూడు తింటూ, సంసార సుఖాలకు దూరంగా వుంటూ, పళ్ళూ పాలు మాత్రమే సేవిస్తూ, ఎవరేమన్నా చిరునవ్వుతో స్వీకరిస్తూ, ఎవరి మీదా కోపం ప్రకటించకుండా వుండాలని ఎందుకు కోరుకుంటారో అర్థం కావడంలేదు. ఈ నెగెటివ్ ప్రచారం ఎవరికి పనికొస్తుంది? మీ నరసింమూర్తి పూర్వాశ్రమంలో ఎవరన్నా అయ్యుండొచ్చు. దానివలన, అతను ఇప్పుడు మంచి చెప్తే వినడంలో తప్పేముంది?'' అన్నా మళ్ళీ.

''వాడ్ని మేము చిన్నప్పటినించీ చూశాము'' అన్నాడు పద్మనాభం.

''అయ్యుండొచ్చు సార్. ప్రతీవాడు 30 ఏళ్ళు వయస్సులో పుట్టడు. చిన్నప్పుడు పక్క తడుపుతాడు, లాగూ పాడు చేసుకుంటాడు, తప్పటడుగులు వేస్తాడూ, పెద్దయ్యి పెద్ద సైంటిస్టు అవగూడదా?''

''మీకు తెలీదు సార్. వాడు పరమ ...'' చాలా విశ్లేషణాలను కూర్చాడు పద్మనాభం. ఇంకా వాదించి, ఆ నరసింమూర్తి భగవాన్‌ని ఇంకా తిట్టించడం ఇష్టంలేక ఆగిపొయ్యాగానీ, మాటలుడిగి కాదు అన్న సంగతి వాళ్ళు గ్రహించకపోయినా నాకేమీ తేడా రాదు.

❋❋❋

రెండో రోజు ఆఫీసుకు వెళ్ళేటప్పటికి అక్కడ ఏదో సినిమా గురించి చర్చ జరుగుతోంది. హీరో గురించి మాట్లాడుకుంటున్నారు. కొత్త వాడైనా బాగా చేశాడు. అందులో ఒకడు నోరు చప్పరించేశాడు.

''వాడు ఎట్లా బతికాడో నాకు తెలుసు. వాళ్ళ అయ్య టీ పెడితే, వీడు ట్రేలో పెట్టుకుని దుకాణాల వాళ్ళకి ఇచ్చి వచ్చేవాడు'' అంటూ.

'ఏం మనుషులు వీళ్ళు?' అనిపించింది. ప్రతీ వాళ్ళనీ తక్కువ చేసి మాట్లాడితేగానీ వీళ్ళు గొప్ప వాళ్ళనిపించుకోరా?

మా ఆంజనేయులు వచ్చాడు ఇంతలోకి. నాకు అర్థమయింది. ఇక సంభాషణ మారిపోతుంది. కానీ మళ్ళీ అంతే మరొకరిని కించపరచడమే. ఆంజనేయులు స్థిమితంగా సీట్లో కూర్చున్నాడు మాట్లాడకుండా అంటే, వాడి దగ్గర ఏదో పెద్ద న్యూస్ వుందని అందరికీ తెలుసు. అందుకే అందరూ మాటలు ఆపి వాడి వైపు తిరిగారు. గొంతు సవరించుకున్నాడు ఆంజనేయులు. అందరిలో ఉత్కంఠ పెరిగిపోయింది. నేను నిస్పృహయంగా నా సీట్లో కూర్చొని ఫైళ్ళు తెరిచాను.

ఆఫీసు ముందు కారు వచ్చి ఆగింది ఇంతలో. తపోభంగం జరిగిన విశ్వామిత్రుడయ్యాడు ఆంజనేయులు ఆ క్షణంలో. కానీ, ఆగింది బాస్ కారు. అందులోంచి బాస్ మాత్రమే కాకుండా, ఒక కాషాయ వస్త్రధారి పెద్ద గడ్డంతో దిగాడు. ఆ ఇద్దరూ బాస్ గదిలోకి వెళ్ళేంతవరకూ, లేచి నిలబడ్డ వాళ్ళంతా కిక్కురమనలేదు. ఆంజనేయులు మళ్ళీ గొంతు సవరించుకున్నాడు గానీ, ఎవరూ వాడి వైపు చూడలేదు. ఇప్పుడెలాగూ దీర్ఘోపన్యాసాలు ఇవ్వలేడని తెలుసు అందరికీ. నేను మాత్రం చూశాను ఆంజనేయులు మొఖంలోకి. చాలా గమ్మత్తుగా వుంది వాడి మొఖంలో హావభావాలు. ఎప్పుడూ నేను చూడని రంగులు కనిపించాయి.

డ్రైవరు బాస్ రూంలో బ్రీఫ్‌కేసు పెట్టి తిరిగి వస్తూ, హాల్లో అందరినీ వుద్దేశించి చెప్పాడు.

''స్వామిగారి మహిమ వల్ల అయ్యాగారి అమ్మాయికి ఆరోగ్యం బాగుపడి ప్రాణాపాయం తప్పింది. ఇక్కడ అందరినీ ఆశీర్వదించడానికి వచ్చారు స్వామి. అందరూ లోపలికెళ్ళి ఆశీర్వాదం తీసుకొని రండి'' అని.

అందరం క్యూలో వెళ్ళాం. ప్రతి వారూ పాదాభివందనం చేస్తూంటే, స్వామి వారి తల మీద చెయ్యి పెట్టి తీస్తున్నారు. నా ముందు ఆంజనేయులున్నాడు. వాడు చేసింది కొంచెం ఓవర్ యాక్షన్ అనిపించింది నాకు. బాస్ చూస్తూంటే, వాళ్ళ అమ్మాయిని వీడు మరీ ఎక్కువగా ముద్దు చెయ్యడం చూశాను ఒకసారి.

చిరునవ్వుతో ఆంజనేయుల్ని పైకి లేపారు స్వామి.

''నువ్వు ఆంజనేయులు కదూ! అన్నారు ఆయన. ఆంజనేయులు తలూపి వూరుకున్నాడు మాట్లాడకుండా.

''చిన్నప్పుడు నా క్లాస్‌మేట్. చాలా తెలివయిన వాడు. మంచి మార్కులు తెచ్చుకునేవాడు. పెద్దలంటేగౌరవం భక్తీ బాగా వున్నవాడు. ఇతను మీ ఆఫీసులో పనిచెయ్యడం మీ ఆఫీసుకే వన్నె తెస్తుంది'' అన్నారు స్వామి మళ్ళీ.

ఆయనెవరో అర్థమైంది నాకు. ఆంజనేయులు పేర్కొన్న భగవాన్!

ఫ్రీ సెక్స్ వున్న అమెరికాలో కూడా బిల్‌క్లింటన్ శృంగార జీవితం గురించి ప్రచారం వేగంగా పాకింది. మహాత్ముడిగా కొనియాడబడ్డ గాంధీ గారి విషయంలో కూడా, ఆయన మనమరాళ్ళతో చెలిమిని తప్పుగా ప్రచారం చేశారు.

ఇప్పుడు అర్థమైంది నాకు - పురాణాల్లో దేవతలూ, భగవంతునికీ రూపాలిచ్చి, వారికీ భార్యా పిల్లలూ, సంసారాలూ మమకారాలూ, ఇష్టాలూ అయిష్టాలూ ఎందుకు చూపించారో.

'జీవితంలో అన్నీ అనుభవించడం తప్పు కాదు' అన్న ఓషో రజనీష్ కూడా అర్థం అయ్యాడు.

**-సమాప్తం**